# బండరాళ్ళు

బండరాళ్ళ బ్రతుకులన్నీ
ఎండిపోవు కాల్వదరిని
మండిరాలు బూదియడవి
లెండన్నను లేవ నెవరు
రండన్నను రానెవరో

అని పాడుకుంటూ భోనగిరిరెడ్డి కొండపక్క అడివిలో వాగుపక్క బండరాతిమీదను కూర్చున్నాడు. అతడు కమ్యూనిస్టూ కాదు, కాంగ్రెసువాడీ కాదు. అతడు తెలంగాణా వీరుడు.

తెలుగుతల్లీ! చెట్లతో జొంపాలతో
నిండిపోయిన పచ్చని కొండలుగలదానా!

ఆకాశానికంటే ఒకటి రెండు బండరాళ్ళను కలిగి ఉన్న గుట్టలుగలదానా! జీవనదులు, ఎండిపోయినవాగులూ ప్రవహింపేదానా! క్రూరైనా చొరరాని కారడవులుగలదానా! సర్వలోహాలు, నవరత్నాలు, కారునలుపు రాక్షసి బొగ్గూ గర్భంలో దాచుకొన్నదానా! తెలుగుతల్లీ! మహోత్తమ దేవీ! అమృత వాక్కులదానా! ఆనందపూర్ణ శిల్పజీవీ! దివ్యసాహిత్యపరులారా! బానిసత్వంలో క్రుంగిపోతూ స్వేచ్ఛకై వెతలు చెందేదానా! వేదనలు హారాలుగా ధరించిన తల్లీ! అవమానాలు కిరీటంగా శృంగారించుకొన్న దేవీ! నీవు బౌద్ధభిక్కునివా?—జైనసన్యాసివా? సౌందర్యపూర్ణయౌవనాంగివా? నీగుళ్ళు కూల్చబడి, నీ గోపురాలు తూల్చబడి, నీశిల్పాలు ఖండింపబడి, నీ సాహిత్యాలు మండింపబడి, సౌష్ఠవపూర్ణమైన నీ బంగారు అంగాలు ఔషధాలకు లొంగని గాయాలుపడి నువ్వు మాయమాటలకు లొంగిపోయి, నువ్వు వేషమే మార్చుకొని స్వచ్ఛకాంతీయత ప్రజ్వలితమైన నీ సౌందర్యము బురఖాలో ముసుగుపడిపోయి, నీ బిడ్డలు పరభాషలకు, పరవేషాలకు సలాములు పెట్టి, ఎన్ని సంవత్సరాలు ఎన్ని శతాబ్దాలు—

ఈనాటికి మా ఆవేదన ఈ రజాకారు యుద్ధంగా పరిణమించి, తల్లీ ఈచేతికొక ఖడ్గాన్ని ప్రసాదించు!

మాతా ఈ కంఠానికొక ఉరుమును అందించు!

సహోదరీ ఈ హృదయానికొక ధైర్యం కవచం చేయి!

వీరపత్నీ! సుమంగళీ! తెలుగుతల్లి, నా చూపులలో చండభాను తైక్ష్ణ్య కాంతులు ప్రసాదించు!

నా పెదవులకు ఆనంద హాసనృత్యము మాయంచేయించు! నేడు తెలుగుజాతి నశించడమో, నిజమయిన స్వాతంత్రపథంలో విహరించడమో!

అని హృదయంలో అనుకొంటూ బోనగిరిరెడ్డి కళ్ళవెంట దొనదొన నీళ్లు కార్చినాడు.

## 2

తెలంగాణా వీరుడా! బోనగిరిరెడ్డీ! నీ కళ్ళయెదుట నీ చెల్లెలికి మానభంగమైనది. ఆమె నూతిలో పడి చచ్చిపోయినది. నీ భార్య మానభగం కాకుండా తన హృదయ రక్తం జిమ్మమని చిమ్మగా పొడుచుకొని నేల వాలింది

నీకు దేశంవదలి తక్కిన ఆంధ్రసీమలకు పారిపోవడం ఇష్టంలేక పోయింది. నీ గ్రామం తగులబడిపోయినా, నీపంటలు మంటగలిసినా, నీవాళ్ళ బ్రతుకులు కూలిపోయినా, అటు గాంధీజీమాటో, ఇటు నీ నాయకుల గర్జనో ధైర్యసాహసాలై ఈ అడవుల్లో, ఈ బండరాళ్ళమధ్య ఈ ఎండిపోయిన సెలఏళ్ళ ఇసుకలలో నిలుపుకొన్నవి.

రజాకార్లను ఎదిరించినావో, రాక్షసులను హతమార్చినావో, సహధర్మచారిణిని పోగొట్టుకొన్న ఒంటిసింహానివై పొదలలో, గుట్టలలో కదులాడుతూ, విదిలించిన కేసరిలా నడిరేయిని విరోధి శిబిరాలు దద్దరిల్లేటట్టు గర్జనచేస్తూ నిలుచుండినావు.

# 3

బోనగిరిరెడ్డికి సహాయంగా భారతీయ సేనలు పోలీసు యాక్షనుచేస్తూ వేంచేశాయి.

మూడురోజుల పట్టపగలులో 200 ఏళ్ళ వృద్ధిపొందిన అసఫ్జాహి దౌర్జన్యం అవతరించిపోయింది. అమ్మ పెట్టవలసిన నాలుగూ పెడితే అబ్బాయికి బుద్ధివచ్చింది.

భారతీయ హిందూజాతి హృదయంలో కక్షలు పెట్టుకునే జాతికాదు. ముస్లిం సహోదరుల హృదయం ఉద్రిక్తత పొంగుచల్లారింది. వారి దౌర్జన్యాలకు వారే సిగ్గుపడిపోయినారు,

భారతీయ సైన్యపు బందూకు మీదనుండి తెలంగాణా హిందూముస్లిం సహోదరులు చేయిచేయి పట్టుకొని "ఆదాబ్ అరజ్—నమస్కారము" అనుకున్నారు కాని బోనగిరిరెడ్డి ఒంటరితనంపోలేదు.

ఓ బోనగిరిరెడ్డీ ఇటు కమ్యూనిస్టులు నీవు ఎరగని ఊహించలేని నాశనపూరితమైన దౌర్జన్యాన్ని రేకెత్తించి తెలుగునాడును దగ్ధపటలం చేస్తారేమోనన్న భయమూ ఆవరించింది.

అటు కాంగ్రెసుబురఖా తగిలించుకొన్న దొంగలు, దోపిడీగాండ్రూ, దేశముఖులు, కౌలుదార్లు ఈ నలుగురూ పూజ్యుడైన బాపూజీ పవిత్ర సత్య వ్రతాన్ని హింసకు ఎరజేసి తెలుగునాటి ప్రజల బ్రతుకులను ఎడారి ముంచేస్తారేమోనన్న అనుమానమూ కలిగింది.

ఒంటివాడవై నీఇంటికిపోతే ఇంటిలో మసలిన సహధర్మచారిణిలేదు. నీ యిల్లే మంటగలిసిపోయింది. నీభూములు ఇతరు లాక్రమించి, నీపశువులు పచనముగావింపబడి, నీ నాగలి ద్వేషపు భోగిమంటలో కలిసి, నువ్వు ఒంటివాడవై నిట్టూరుస్తూ నీకు ఆశ్రయం ఇచ్చిన ఆ బండరాళ్ళ మధ్యకే మళ్ళీ వచ్చి నిలుచున్నావు.

నీ ఆస్తి తెలంగాణాకు పాతగొంగళి. నీపాస్తి అడవులలోని సీతాఫలపు పళ్ళు!

# 4

ఒకరోజున భోనగిరిరెడ్డి తాను అడవుల్లో సంపాదించుకున్న ఆ పిదప కాలంనాటి సీతాఫలపుపళ్ళూ, కట్టెడు మోదుగాకు వరంగల్లు బజారుకువెళ్ళి అమ్ముకొని నల్లబజారులో సేకరించిన ఇన్ని జొన్నలు, ఇంత ఉప్పు కారం పట్టుకొని ఆ ఒంటిమిట్టకు 15 మైళ్ళ దూరంలోవున్న తన మూడుమిట్టల స్వగ్రామానికి వచ్చాడు.

స్వగ్రామం అంటే ఆతని వెనకటి గ్రామంకాదు. తాను ఒంటిగా నివసించిన ఆ కొండపక్క బండరాళ్ళే ఆతని స్వగ్రామం. అక్కడే ఆత డొక చిన్నగుడిసె వేసుకున్నాడు. ఏటిలోకి ప్రవహించివచ్చే చిన్న సన్నని ఊటకు అడ్డంకట్టి, చిట్టిగుంట నిర్మించుకొని ఆ నీటితో తడుపుకుంటూ ఆ బండరాళ్ళ దత్తుకొడుకు భోనగిరిరెడ్డి వ్యవసాయం చేస్తున్నాడు.

ఒకటి రెండు కూరగాయలైతే వరంగల్లుపోయి అమ్ముకునేవాడు. ఆతని కడుపుకింత అన్నంపెట్టిన తల్లులు సీతాఫలపుపళ్ళు, మోదుగాకు. అవి అమ్మగా వచ్చిన డబ్బులు ఆతని రొట్టెకు జొన్నపిండి ఇచ్చాయి. రుచికి ఉప్పు కారాలిచ్చాయి, ఆ అడవిలోనేవున్న ఇన్ని చింతకాయలేరి తొక్కు చేసుకున్నాడు.

ఆనాడు సాయంత్ర మింటికి చేరుకుంటూవుంటే దూరంగా తన ఇంటి దగ్గర ఏదో చిన్న మంట కనిపించింది. అమ్మయ్యో! యింకా తన బ్రతుకులో కష్టాల మొయిళ్లు చెదరిపోయి ఆకసము తేటపడలేదా అనుకున్నాడు. అనుకుంటూ ఒగర్చుకుంటూ ఒక్క పరుగులో ఇంటి దగ్గర వాలాడు. ఇంటి కెదురుగుండా మూడురాళ్ళు పొయ్యిగాపెట్టి ఒక స్త్రీ రొట్టె కాలుస్తోంది. అతడు తెల్లబోయి ఆలాగే నిలుచుండి ఎవరు నువ్వు అని అడిగినాడు.

ఎవర్ని నేను? ఆమె బదులు చెప్పినది.

"ఇక్కడ యేమి చేస్తుంటివి?"

"రొట్టె కాలుస్తున్నా అయ్యా! నీ బాంచను. కాలుమొక్కుతా."

"రొట్టెకు పిండి ఎక్కడిది. ఈ కుండమూకుడు ఎక్కడిది?"

"ఈ గుడిసెలోవుంటే పట్టుకొచ్చినాను తెలియక. పిండి ఆ చిల్లు కుండలోవుంటే తడిపి రొట్టె కాలుస్తున్నాను."

"ఇదేమిటి? అసలు నువ్వెవరంటే?"

"నే నెవర్నని చెప్పను అయ్యా? నే నెవర్నో! నాకు యాదుండేది? నా మగణ్ణి చంపినారు. నన్ను చెరిచినారు. బాదినారు. నేను సెయి తెలియక పడిపోయి, కండ్లు తెరిచేతలికి మా వూరు మండిపోబట్టింది. నేను చావక మిగిలినా. నా వూరు నాకు యాదిలేదు. ఏహో తెరచాటు. ఈ వూరూ ఆవూరూ బిచ్చమడిగి, ఈ కాయతిని ఆ నీరు త్రాగి ఈడకు వచ్చినా. నీ బాంచను. కాలు మొక్కుతా!"

భోనగిరిరెడ్డి చెట్టుమోడులా అలా నిలుచుండిపోయినాడు. అతని కళ్ళవెంట దొన దొన బాష్పబిందువులు దిగి కారిపోయినాయి.

రజాకార్ల రాకాసిరాజ్యం పోయింది. ఇండియా యూనియన్ బందూకుపై నుండి హిందూ ముస్లిములు చేయి చేయి కలుపుకున్నారు.

ఓ తెలుగునాటి స్త్రీ! నీ హృదయంలో మాయరాని గాయాలు తగిలినవా? నీ బ్రతుకు ఖండఖండాలుగా గొడ్డలి వ్రేటుపాలై దుమ్ములో రాలి పోయిందా?

భోనగిరి రెడ్డి హృదయంలో ఆ స్త్రీ చిన్న బిడ్డలా దర్శనమిచ్చింది, ఏకాకిగా ఎవరూలేని ఎడారిలో ఎలుగెత్తి ఏడ్చే పసిపాపలా కనిపించింది. తన్ను చూచి నిల్చున్న ఆ స్త్రీని పైకి ఉబికి రాలేని వెక్కి వెక్కి ఏడ్పుతో ఆతడు తన హృదయానికి గాఢంగా అదుముకున్నాడు.

"ఓ ఆడదానా! తల్లీ తండ్రీ భర్తా బిడ్డా చుట్టమూ దైవమూలేని ఓ తెలుగునాటి ఆడదానా! ఈ బండరాళ్ళమధ్య ఈ కొండపక్క ఈ ఎండి పోయిన వాగుదరిని ఈ గుడిసెలో అన్నీ మరచి ఒళ్ళు తెలియక నిదురపో.

ఒక కొత్తపొద్దులో కళ్ళు తెరిచి కొత్తరంగులు చూచి ఆనందించు. కొత్త సుగంధాలు వాసనచూస్తూ మైమరచిపో" అన్నాడు.

## 5

భోనగిరిరెడ్డి పేరులేని ఆ తెలుగునాటి స్త్రీకి ఒరంగలు బజారులో దొరికిన ఒక ముతకచీర ఒక ముతకరైక కానుక్క వచ్చాడు. అంత యుద్ధంలోనూ ఆతని చేతిని దండకడియాలు పోలేదు. అవి అమ్మి బండ రాళ్ళమధ్య నిలుచున్న ఒంటివాడైన తన గుడిసె ప్రాంగణానికి దిక్కు తెలియక తన్ను మరచి నడిచివచ్చిన ఆ తెలుగునాటి స్త్రీకి కానుక్క వచ్చినాడు.

ఆ చీర అప్పుడే వికసిస్తున్న మోదుగుపువ్వుల ఎరుపు చీర.

ఆ రైక అనాటి నిర్మలాకాశపు నీలి రైక. దాని అంచులు చివుళ్ళు తొడిగి యవ్వనంతాల్చే ఇప్పచెట్టు పచ్చని ఆకురంగు.

ఆ బండరాళ్ళలో నవ్యాశామూర్తియైన భోనగిరిరెడ్డి, నవ్యశక్తి స్వరూపిణియైన ఆ తెలుగునాటి స్త్రీ ఈ సంక్రాంతి ఉదయంలో ఒక నూత్న యుగ ప్రవేశం గమనిస్తూ నిలుచున్నారు.

రెండు వందల సంవత్సరాలనాటి కాలము వెనక వేసుకొని నూత్న సౌందర్యము అలంకరించుకొన్న ఓ తెలుగునాటి స్త్రీ ఎండిపోయిన నీ దేహ సౌష్టవ సౌందర్యము నూతనార్ద్రిత సముపార్జించుకొని నీ కాలి ముందర సెలయేరు కొత్తనీటి ప్రవాహాలనిండి నీ తెలుగునాడు ఇటు తూర్పు తీరము అటు మంజీర తీరాలుదాటి నీ తెలుగురెడ్డి బ్రతుకును పాలసముద్రము చేస్తుందా ?

కొండవాగు పక్కన బండరాళ్ళు, పూరి గుడిసె పక్కన యెడదపొంగి అంచులు చాపుకుంటూ కిలకిలమనే భోనగిరిరెడ్డి సాగుచేసిన పొలం.

కొండపక్క అడవిలో వాగుపక్క బండరాతిమీద తెలుగునాటి ఆడుబిడ్డా, కొండపక్కన అడవిలో వాగుపక్క బండరాళ్ళు.